క్లుప్తంగా

నేడు సున్నా వడ్డీ నగదు జమ

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నాలుగో విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేయనున్నట్లు ఏపీఎం పి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. మండలంలోని 39 గ్రామాలకు సంబంధించి 1307 మహిళా సంఘాలున్నాయని, ఇందులో 1091 మహిళా సంఘాలకు సున్నా వడ్డీకి అర్హత వుందన్నారు. ఈ మేరకు రూ.1,20,11,897లు మహిళా సంఘాల సభ్యుల ఖాతాలో జమ అవుతుందన్నారు.

ప్రేమామృత ప్రసాదం పంపిణీ



గర్భిణులకు ప్రేమామృత ప్రసాదం అందజేస్తున్న సాయి భక్తులు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని సత్య సాయి మందిరంలో మంగళవారం సాయి మాత ప్రేమామృత ప్రసాదం గురువారం పంపిణీ చేశారు. నెలలో ఒకసారి గర్భిణులు, బాలింతలు, నిరుపేదలకు ప్రేమామృత ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు సాయిభక్తులు తెలిపారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే వారి పేరున సాయిమాత ప్రేమామృత ప్రసాదం పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



గొట్టివలసలో నామినేషన్లను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస, పెద గుడబ గ్రామ పంచాయతీలకు సంబంధించి వార్డు మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. రెండు పంచాయతీలకు సంబంధించి వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే అందిందని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. నామినేషన్లను పరిశీలించి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృంహస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు. ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో గురువారం ఉదయం 6 గంటలనుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి క్యూలోఉన్న భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్నిప్రమాదాల నివారణపై ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు ప్రజలను కోరారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన పెట్రోల్,డీజిల్ కొట్టేటప్పుడు, కొట్టిన తరువాత అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

● ఎమ్మెల్యే కళావతి



అభివృద్ధి, సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, అధికారులు, సిబ్బంది

సీతంపేట: ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కడగండి సచివాలయం పరిధి పెద్దవంగర, పొలంగూడ, చిన్నవంగర, గాలికుప్పగూడ, రోలిగుడ్డి, కొత్తగూడ, మొకరనాయుడుగూడ, గొరిపాలెం, బంజరుగూడ, రాయమనుగూడ తదితర గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటుగా పథకాలు ఎలా అందుతున్నాయనేది అడిగి తెలుసుకున్నారు. సమస్యలు కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, నిత్యం ప్రజలు సంతోషంగా ఉండే విధంగా అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, డ్రైనేజి సౌకర్యాలు, వరద గోడలు కల్పిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో అర్హులైన అందరికి అటవీ హక్కుల సాగు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. మనబడి నాడు – నేడు ప్రోగ్రాం ద్వారా పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ సవర లక్ష్మి, సర్పంచ్‌లు సువార్త, కళావతి, ఆదిలక్ష్మి, కుమారి, రవి, ఎంపీటీసీ హరిప్రసాద్, పార్టీ నాయకులు ఎస్.రాము, చంద్రరావు, అబ్బాస్, దాసునాయుడు, త్రినాద్, సుబ్బారావు, శరత్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా నా భూమి – నా దేశం

పాలకొండ:

నా భూమి – నా దేశం నగర పంచాయతీలో గురువారం ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ నాయకుల విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. మట్టి దీపాలను చేతిలో పెట్టుకుని నేలకు వందనం అంటూ పట్టణంలో మొక్కలు నాటారు. అనంతరం 17వ వార్డు కౌన్సిలర్, మాజీ సైనిక ఉద్యోగి దుప్పాడ పాపినాయుడును సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభిమన్యును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

నేల తల్లికి వందనం

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామంలో సర్పంచ్ కర్రి రమాదేవి ఆధ్వర్యంలో గురువారం నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల తల్లికి వందనం –అ మర వీరులకు జోహార్లు అంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, ఎంపీడీవో జయంత్‌ప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి సైనికులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు



పాలకొండ: నా భూమి – నా దేశం కార్యక్రమంలో వందనం చేస్తున్న చైర్మన్ తదితరులు

భావితరాలకు మేలు చేకూరేలా..

పాలకొండ రూరల్: భావితరాలకు మేలు చేకూరేలా నేల తల్లిని కాపాడుకుందామని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరితో కలసి గురువారం నా భూమి – నా దేశం కార్యక్రమాలను మండలంలోని అంపిలి, జంపరకోట, పెద్ద కోటిపల్లి, భాసూరు, నవగాం, వాటపాగు గ్రామాల్లో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వసుధకు వందనంలో భాగంగా ఆయా గ్రామాల సర్పంచులు లోలుగు విశ్వేశ్వరరావు, ఆరిక వెంకటేష్, సింగంవలస మంగామణి, ఎస్.మల్లేశ్వరమ్మ, తొర్లపాటి నీరజ, వావిలపల్లి రాజారావు తదితరులు తమ పంచాయితీల్లో 75 మొక్కలు నాటారు. సర్పంచులు, విద్యార్థులు సంయుక్తంగా పుడమిని కాపాడుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, జాతీయ ఉపాధి హామీ ఏపీవోలు ఎం.ఈశ్వరమ్మ, ఎస్.కృష్ణారావు, ఈసీ పద్మజ, కె.ప్రసాద్, సచివాలయ, ఉపాధి సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



వీరఘట్టం: నడుకూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాలకొండ రూరల్: భాసూరు గ్రామంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

నా భూమి – నా దేశం అంటూ వెలుగెత్తి చాటుదాం

భామిని: నా భూమి – నా దేశం అంటూ అందరూ వెలుగెత్తి చాటుదామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు తోట సింహచలం ఎంపీడీవో జి.చంద్రరావు అన్నారు. భామిని, నేరడి – బి, గురండి, కాట్రగడ – బి, మణిగలలో నా భూమి – నా దేశం శిలాఫలకాల వద్ద నంద ప్రాణ ప్రతిష్టలు చేసి నివాళులర్పించారు. వసుధకు వందనం చేపట్టి భూమాతకు నమస్కారాలు చేశారు. సర్పంచ్‌లు సరిసాబద్ర జగదాంబ, జామి భైరాగి, కొండగొర్రి మంగమ్మల ఆధ్వర్యంలో ఉపాధి ఏపీవో ఇ.తులసీదాస్, ఈవోపీఆర్‌డీ జి.కృష్ణారావు కార్యక్రమాలను నిర్వహించారు. ఈసీ రమణమూర్తి, ఉపాధి టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



భామిని: నేరడిలో వసుధకు వందనం చేస్తున్న సర్పంచ్ జగదాంబ,అధికారులు



గరుగుబిల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న వైకేపీ, ఉపాధి, ఇతర శాఖల సిబ్బంది

మహనీయుల త్యాగాలు మరువలేం..

గుమ్మలక్ష్మీపురం: దేశ స్వాతంత్ర్య సాధనకు మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని పురష్కరించుకొని మండలంలోని రెల్ల గ్రామ సచివాలయం వద్ద స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వీరులకు చిహ్నంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. సర్పంచ్ మండంగి శంకరరావు, మాజీ సర్పంచ్ మండలరావు తదితరులతో కలిసి దేశ వారసత్వ సంపదను కాపాడుకుంటాం.. భారత దేశం యొక్క ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాం.. దేశాన్ని రక్షించే వారిని గౌరవిస్తాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన నాయకులు, సైనికులను జ్ఞాపకం చేసుకొంటూ నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆర్మీ మాజీ జవాన్ అభిమన్యును సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుకు గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపిక

గుమ్మలక్ష్మీపురం: రైతుల్ని నూరు శాతం ప్రకృతి సాగుబాట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తొలిదశలో ఒక మండలాన్ని ప్రకృతి సాగులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి గుమ్మలక్ష్మీపురం మండలం ఎంపిక చేయడం పట్ల ఆనందాన్ని వెలిబుచ్చారు. ఇప్పటికే ఇక్కడి గిరిజన రైతులు ప్రకృతి సాగులో ముందుకు సాగుతుండగా ప్రభుత్వ నిర్ణయంతో మరింత అభివృద్ధిని సాధిస్తూ, 100 శాతం ప్రకృతి సాగులో ఆదర్శంగా నిలువగలరన్న ఆశాభావం వ్యక్త పరిచారు. కాగా, రైతు సాధికార సంస్థ సిబ్బంది ఎంపిక చేసిన మండలాల్లో సన్న, చిన్నకారు రైతులను గుర్తించి వారిని ప్రకృతి సాగు వైపు మళ్లించేందుకు అవసరమైన చేయూత ఇచ్చేందుకు ఇందుకు సంబంధించిన కీలక బాధ్యతలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఆదర్శ మండలాల్లో పౌష్టికాహారం అవసరమయ్యే వారందరికీ నూటికి నూరు శాతం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని చిన్నారావు పేర్కొన్నారు.

పోర్జా పైడి అసోషియేషన్ కార్యదర్శిగా గడ్డెయ్య

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ పోర్జా పైడి అసోషియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా గొర్లె గడ్డెయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర అధ్యక్షుడు పట్లాసింగి రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గౌరవ అధ్యక్షుడిగా గంటా అప్పన్న, జిల్లా అధ్యక్షునిగా బిడ్డిక సుధాకర్, ఎన్నికయ్యారన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మండంగి హరనాథ్, పి.ప్రభుకుమార్, ఉపాధ్యక్షులుగా రాజు, కోశాధికారిగా డి.ప్రకాశరావు, కనకరాజు, సోషల్ మీడియా కన్వీనర్‌గా చంటి, జీవన్‌కుమార్, లీగల్ సెల్ కన్వీనర్‌గా శాంతిరాజు, పెంకి కృష్ణారావు ఎన్నియ్యారన్నారు. సభ్యులుగా సంజీవి, బాలకృష్ణ, కాంతారావు, శంకరరావు తదితరులు ఎన్నికయ్యారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



మాతా శిశు సంరక్షణపై అవగాహన కలిగిస్తున్న నాగభూషణరావు

పాలకొండ: మాతా శిశు సంరక్షణ చర్యలు బాధ్యతగా చేపట్టాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో వైద్య సిబ్బందితో మాతా శిశు సంరక్షణపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లీబిడ్డల సంరక్షణ కోసం పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పోషకాహారం అవస్యతకను వారికి వివరించాలని తెలిపారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు జె.రవీంద్రకుమార్ పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల ఆందోళన



గుమ్మలక్ష్మీపురం సబ్ పోస్టాఫీస్ ముందు నిరసన తెలుపుతున్న తపాలా శాఖ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ తపాలా ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని గుమ్మలక్ష్మీపురం సబ్ ఆఫీస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు అధికారి జయంతిరావు, జి.చిన్నంనాయుడు, సీరాపు కళ్యాణి, పాలక సత్యనారాయణ, బి.రాజేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐజీడీఎస్ యూనియన్ పిలుపు మేరకు గురువారం గుమ్మలక్ష్మీపురం సబ్ పోస్టాఫీస్ ముందు తపాలా శాఖ ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని మరియు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనంగా ఉన్నతి కల్పించాలని, గ్రూప్ ఇన్సురెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలను పెంచాలని, పెయిడ్ లీవ్‌ను 180 రోజుల వరకు దాచుకొని నగదుగా మార్చుకొనే సౌకర్యం కల్పించాలని, జీడీఎస్ మరియు వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, టార్గెట్స్, మేళాలు రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్ని రకాల వేధింపులను ఆపి వేయాలంటూ డిమాండ్ చేశారు.

ఫ్లీట్ కార్యాలయం ప్రారంభం



108 ఫ్లీట్ కేంద్ర ప్రారంభోత్సవంలో అధికారులు, సిబ్బంది

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో గురువారం 108 ఫ్లీట్ (వాహన మరామ్మతుల)కార్యాలయాన్ని ఏపీ 108 ఫ్లీట్ కార్యాలయాల నిర్వాహకులు వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 108, 104, 102 వాహనాలు మరామ్మతులకు గురైతే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం తీసుకువెళ్లి బాగు చేయించాల్సి రావటంతో తీవ్ర ఇబ్బందులు, సమయం వృథా అయ్యేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. స్థానికంగా ఫ్లీట్ కేంద్రం అందుబాట్లోకి రావటం మంచి పరిణామంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు జిల్లాల ఫ్లీట్ మేనేజర్లు రవికిరణ్, భాస్కర్, జగ్గరాజు, 108 మేనేజర్లు మన్మధరావు, నజీర్‌హుస్సేన్, 104 జిల్లా మేనేజర్ దుర్గాప్రసాద్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది విజయకుమార్, ప్రదీప్, రాజశేఖర్, షణ్ముఖరావు, సంతోష్, గిరిబాబు, 108 సిబ్బంది గిరి గణపతి, కాంబాబు, రేరాజు, రవిబాబు పాల్గొన్నారు.

నిరంతర ఆదాయం పొందేలా పంటల సాగు



లక్కగూడలో ఏర్పాటు చేసిన ఏటీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న మండల టీం లీడర్

గుమ్మలక్ష్మీపురం: నిరంతరం ఆదాయం పొందేలా పంటలను సాగు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం గుమ్మలక్ష్మీపురం మండలం ఏటీఎం మోడల్ టీం లీడర్ గణేష్ శరత్ చంద్ర అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 20 సెంట్ల భూమిలో నిరంతరం ఆదాయం పొందేలా రూపొందించిన ఏటీఎం మోడల్‌ను మండలంలోని లక్కగూడ గ్రామానికి చెందిన పెదపెంకి గోపినాథం అనే రైతు అనుసరిస్తున్నాడు. ఈ మోడల్‌ను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఈ ఏటీఎం మోడల్‌లో టమాట, వంగ, మిర్చి, గోరుచిక్కుడు, బొబ్బర్లు, మొక్కజొన్న, ఆకుకూరలు, దుంప జాతులు వంటి సుమారు 15 రకాల ఉత్పత్తులను ఏడాది పొడవునా సాగు చేయాల్సి ఉంటుందని, వచ్చిన ఫల సాయాలను ఇంటి అవసరాలు వినియోగించగా మిగిలినవి మార్కెట్లో విక్రయిస్తే ఏడాదికి తక్కువలో రూ.50 వేల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఆయన వెంట మెంటర్ మహేష్, కోఆర్డినేటర్ భూషణ్, ఎంటీ జి.నిర్మలా దేవి, ఎల్‌త్రీలు దీప, లత, పద్మజ, పరశురాం, రవి ఉన్నారు.

వేడుకగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

భామిని: స్థానిక ఎంఎంపీ పాఠశాల ప్రాంగణంలో యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని మండల శాఖ అధ్యక్షుడు ఈగల తిరుపతిరావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసేందుకు యూటీఎఫ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పాఠశాలల విలీనంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కద్రక ప్రసాద్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

● నులి పురుగులను నులిమేద్దాం..

నులి పురుగుల నివారణకు ప్రభుత్వం చేపట్టిన డీవార్మింగ్ డే అంతటా గురువారం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో చిన్నారులు, విద్యార్థులకు అల్బెండోజోల్ మాత్రలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య శాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులచే మాత్రలు వేయించారు. - సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: తాడికొండ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండోజోల్ మాత్ర మింగిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌కుమార్



కొమరాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో విద్యార్థినులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్



భామిని: బాలేరులో మాత్రలు వేస్తున్న జేసీఎస్ కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, సర్పంచ్ ప్రభాకర్



పాలకొండ: నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి కమలనాథ్



జియ్యమ్మవలస: అల్లువాడ పాఠశాలలో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ రూపాన్సీ



గరుగుబిల్లి : రావివలస పీహెచ్‌సీలో అల్‌బెండోజోల్ మాత్రలు వేస్తున్న ఎపిడిమాలజిస్టు డా.నవీన్‌కుమార్



సీతంపేట: బాలికల ఆశ్రమ పాఠశాలలో అల్‌బెండోజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది